# మరీచిక



“కుమారి కమలాదేవి!

మీ రచన ‘చీకటితెరలు’పై చేసిన నా విమర్శకు మీ రిచ్చిన ప్రత్యుత్తరం అందినది. అది చూసి ఎంతగా ఆనందించేనో వర్ణించాలంటే ... నేను రచయితను కాను. నాది సద్విమర్శ అనీ, నే నెత్తి చూపినవి నిజంగానే లోపాలనీ, ఇకముందు మీ రచనలలో అలాటి లోపాలు రాకుండా చూస్తామనీ, నాలాటి సహృదయులైన విమర్శకులతోటి సాహచర్యం రచనా జీవితంలో ఎంతో అవసరమనీ వ్రాశారు.

నిజంగా రచయితలందరికీ మీలా విమర్శలను నిష్పాక్షికబుద్ధితో స్వీకరించగల నైతికధైర్యం ఉంటే ఎంత బాగుండును! నా విమర్శ ఒక ప్రఖ్యాత రచయిత్రి

రచనాభివృద్ధికి దోహదకారి అవుతుందంటే, అంతకంటె నేను గర్వపడవలసిన విషయమేముంది?

చిరకాలం మీతో కలంస్నేహం కోరుతూ
విజయ్.
హైదరాబాదు,
ఏప్రిలు 7, 67."

"డియర్ కమలాదేవీ!

ఈ నెలరోజుల్లో మనిద్దరిమధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఎంత ఆహ్లాదకరంగా ఉన్నాయి! నిర్మల హృదయులైన యువతీయువకులమధ్య గల స్నేహం ఇంత మధురంగా ఉంటుందని ఇంతకుపూర్వం నాకు తెలియదు.

నాలో సృజనాత్మకశక్తి లేదు. ఒకరు వ్రాసినది విమర్శించగలనుకాని నాకుగా నేను వ్రాయలేను. కాని మీ లేఖలు చదువుతూంటే నాలోనూ రచనాశక్తి వస్తున్నట్లుగా తోస్తూంది. ఎంతైనా సహవాస దోషం!

మీ లేఖలు ఎంతో గొప్పగా ఉంటాయి. ఒక సామాన్య పాఠకుడినైన నాకు వ్రాసే లేఖలే ఇంత కళాత్మకంగా, మనోహరంగా ఉన్నాయంటే, రచయిత్రిగా మీ కౌశలానికి మరో నిదర్శనం ఏం కావాలి?

నాకూ వ్రాయాలనిపిస్తూంది. పరవళ్లుతొక్కే నా హృదయ గత భావాలను నలుగురికీ చెప్పాలని పిస్తూంది. ఏదో చెయ్యాలని, ఏమిటో కావాలని ఆరాటం. నాకేం కావాలో నాకే సరిగ్గా తెలియటం లేదు. యౌవనోదయమంటే ఇదేనా?

మీ జవాబుకోసం వెయ్యికన్నులతో ఎదురుచూసే
విజయ్.
హైదరాబాదు,
ఏప్రిలు 13, 67."

"కమలా!

ఇప్పుడే మీ ఉత్తరం అందింది. ఈ ఆరు రోజులు ఆరు యుగాలుగా గడిపేస్తూ చంద్రునికోసం చకోరిలా, స్వాతిజల్లుకోసం ముత్యపుచిప్పలా (నవ్వకండి) మీ లేఖకోసం ఎదురుచూస్తూ దాదాపు పిచ్చివాడినే అయ్యేను.

మీ లేఖలో పాలపొంగువంటి తొలియౌవనాన్ని గురించి ఎంత చక్కగా వర్ణించేరు! యౌవనప్రారంభ దశలో ఇలాటి ఆవేదన, అసంతృప్తి ఎంతో సహజమని, మానవుడి జీవితంలోని దశలన్నిటిలోకీ ఇది ఎంతో ముఖ్యమైనదని, ఈ దశే అతని నైతికజీవితాన్ని తీర్చిదిద్దగలదని వ్రాసేరు. నాలో అస్పష్టంగా, అవ్యక్తంగా ఉన్న ఈ భావాలనే ఎంత చక్కగా వివరించేరు! ఎంతైనా రచయిత్రులు కదా.

మీకు కోపం రాకుండా ఉంటుందని హామీ ఇస్తే మిమ్మల్ని ఒకటి అడగాలనిపిస్తూంది. కాని అలా అడిగే అర్హత నాకుందో లేదోనని సందేహిస్తున్నాను.

దయచేసి ఈ విషయమై వెంటనే జవాబిస్తారు కదూ?

మీ
విజయ్.
హైదరాబాద్,
ఏప్రిలు 20, 67."

**చర్మచక్షువులకు గోచరించే రూపం ఒక్కటే సౌందర్యానికి ఆలవాలం కాదు. కొందరికి మేధ అందంగా కనిపిస్తుంది. కొందరికి హృదయం అందంగా కనిపిస్తుంది. అన్నిటికన్న ఆత్మసౌందర్యం గొప్పదంటారు. బాహ్యసౌందర్యాన్ని విస్మరించి ఆత్మ సౌందర్యాన్ని మాత్రమే గుర్తించడం గుడ్డివారికే సాధ్యం, కాక విరాగులకూ సాధ్యమే.**

"డియర్ కమలా!

స్నేహసౌరభాలను వెదజల్లే నీ లేఖ అందింది. ఒక మహోన్నత వ్యక్తిత్వాన్ని, ఒక మహా సుందర హృదయాన్ని నింపుకుని వచ్చిన ఆ లేఖను ఆప్యాయంగా కళ్లకద్దుకున్నాను.

'విజయ్! నా ముందుకూడా నీకు సంకోచమెందుకు? నా వద్దకూడా అర్హతానర్హతలను గురించి భయపడాలా? వేలాది పాఠకులలో నీ కొక్కడికే వ్యక్తిగతంగా జవాబిస్తేనంటే నీ అర్హతనుగూర్చి నా కెలాటి అభిప్రాయం ఉందో తెలుసుకోలేవా?' అంటూ వ్రాసేవు.

స్నేహబాంధవ్యాలను సూచించే ఆ 'విజయ్!' అన్న పిలుపు నా హృదయాన్ని గిలిగింతలు పెట్టింది. నా పేరులో అంతటి సౌందర్యం, మాధుర్యం ఉన్నట్లు నాకు తెలియదు ఇంతకుపూర్వం.

కమలా! ఆ రోజు నిన్నడగాలనుకున్నదేమిటో తెలుసా? ఇదే! నీ తియ్యని కంఠంనుండి అనునిత్యం 'విజయ్!' అన్న ఈ పిలుపే నాకు కావాలి. నీ రచనల్లోని నాయకుల్లా నాలో గొప్ప వ్యక్తిత్వం లేకపోవచ్చు. నీ 'చీకటితెరలు'లోని శేఖర్‌లా నేను ధీరోదాత్తుణ్ణి కాకపోవచ్చు. కాని రచయిత్రిగా నిన్నారాధిస్తూ, భార్యగా నిన్ను గౌరవిస్తూ, ప్రేయసిగా నిన్ను ప్రేమించే హృదయం నాకుంది.

కమలా! నేను నీవాడను కావాలి. నీ కలంలోని భావాల్లా నీ ప్రేమలో నేను కరిగిపోవాలి. ఇలా ఆశించటం అత్యాశ కాదనే నా నమ్మకం. ఒకవేళ నీ మనసు కష్టపెట్టినట్లు తోస్తే క్షంతవ్యుడను.

నీ
విజయ్.
హైదరాబాదు,
ఏప్రిలు 30, 67."

"నా ప్రియమైన కమలా! నా హృదయసరోవరం లోని కమలనూ!

ఈ రోజు నా జీవితంలో ఎంతటి శుభదినం! ముత్యాలసరాలవంటి అందమైన దస్తూరిలో, అంతకంటె అందమైన మధురభావాలను బంధించి వ్రాసిన నీ లేఖను ఎంతో పవిత్రంగా దాచుకొన్నాను.

## పరిమళా సోమేశ్వర్

నా హృదయరాణీ! ఈ సమయంలో నాలోని భావోద్వేగాన్ని నీ కెలా తెలపాలో తెలియటంలేదు. ఏమి వ్రాసినా ఇంకా ఏదో చెప్పాలని, ఎంత వ్రాసినా అసలు చెప్పవలసినది చెప్పనేలేదని అనిపిస్తూంది. ఒకవేళ వ్రాసినా నీకు నవ్వుతుందో లేదోనని ఓపక్క భయం, ఏం వ్రాసినా నా ప్రేయసి సద్వర్థం చేసుకోగలదని మరోపక్క ధైర్యం . . . ఇలా ఉంది నా మనఃస్థితి. పిచ్చివాడినని నవ్వుతున్నావా? షేక్స్పియర్ చెప్పినట్లు ప్రేమికుడు, పిచ్చివాడు ఒకే రకమైన మానసికస్థితిలో ఉంటారట! వాస్తవికతను విస్మరించి అనుక్షణం ప్రేయసీ హృదయాంబరవీథిలో విహరించే నేను పిచ్చివాడనే! కాని నా ఈ పిచ్చే నా కానందం. ఏమంటావ్?

నీ ప్రియాతిప్రియమైన
విజయ్.
హైదరాబాదు,
మే 24, 67."

"హృదయేశ్వరీ!

నీ ప్రేమకు పాత్రుడనైనప్పటినుండి నాకు జీవితం నందనవనంలానే కనిపిస్తూంది. తీయని తావులను చిమ్మే ఈ సుమబాలలు, నీలాకాశంలో మిలమిల మెరిసే తారకలు, ఆకుల్లోని పచ్చదనం, రోజాలోని ఎర్రదనం, ఈ సౌందర్యాన్ని భరించలేకపోతున్నాను డియర్. మధురోహలతో, తీయని బాధతో, తీరని కోరికలతో కంపించే నా హృదయానికి నిన్ను గాఢంగా హత్తుకోవాలనిపిస్తూంది.

కాని మానసికంగా ఇంత దగ్గర్లో ఉన్న మనం నిజజీవితంలో రెండువందల మైళ్ళ దూరంలో ఉన్నాం. చూడు ఎంత క్రూరుడో ఈ విధాత! అంతకంటె క్రూరుడు మా ఆఫీసరు! అరిచి గీపెట్టినా ఒక్క రోజుకూడా సెలవిచ్చేది లేదంటున్నాడు. జూన్ నెలాఖరుతో ఆఫీసు తఖ్తీ అయిపోతుంది. అప్పటికి కాని సెలవు దొరకదు. అంతవరకు మనం ఇలాగే హృదయాలతో సంభాషించుకుంటూ, కలంతో పలకరించుకుంటూ కాలం గడపాలి.

అన్నట్లు అసలు విషయం చెప్పటం మరిచేను. మావాళ్ళు నా పెళ్లివిషయమై ఒత్తిడి చేస్తున్నారు. మా మేనమామ కూతురు భానుమతిని చేసుకోవాలని వాళ్ల కోరిక. భాను నిజంగా అందమైనదే. కలువరేకులవంటి కన్నులు, సంపెంగమొగ్గలాటి ముక్కు, గులాబిరేకులవంటి పెదవులు, ధవళకాంతులు విరజిమ్మే శరీరచ్ఛాయ . . . ప్రబంధనాయికలానే ఉంటుందామె.

కాని అందమైన బొమ్మల్లాటి ఆడవాళ్లంటే నా కసహ్యం. నాకు భార్య కాదగ్గ స్త్రీలో చైతన్యం ఉండాలి. నా మనోగతభావాలను విప్పి చెప్పకనే అర్థం చేసుకునే మేధావిని కావాలి. నా హృదయంలో ఇమిడి పోయి, నా భావంలో కలిసిపోయి, నాలో ఐక్యమైపోయే రసమయి నా అర్ధాంగి కావాలి.

లోకదృష్టిలో భాను సౌందర్యవతే కావచ్చు. కాని అసమానమైన నీ భావసౌందర్యంముందు ఆమె దేహసౌందర్యం ఏపాటిది? ఆమె బి. ఎ పాసయింది. కాని అద్వితీయమైన నీ పాండితీప్రకర్షముందు ఆమె చదు వేపాటిది?

అందుకే భానుని చేసుకునే ఉద్దేశ్యం లేదని

ఖచ్చితంగా మావాళ్లకు చెప్పేను. ఆమె కాలేజీలో చదివే రోజుల్లో ఎంతోమంది విద్యార్థులకి ఆమె అందాన్ని చూడడంతో మతి భ్రమించిందట. ఆమెకు వచ్చే వేలాది ప్రేమలేఖలను చింపలేక వాళ్లనాన్నగారి చేతులు నొచ్చేవిట! అలాటి అమ్మాయిని తిరస్కరించినందుకు విర్భాంతపోతున్నారంతా!

వాళ్ల వెర్రి చూస్తుంటే నవ్వు వస్తుంది నాకు. దైవమిచ్చిన రూపాన్ని చూసి అదేదో ప్రత్యేకం తాము ప్రయత్నించి సాధించిన ఘనవిజయమని భావించే ఈ మానవులమీద జాలిపడటంతప్ప ఏం చెయ్యలేం కదూ?

ఇక ఉంటాను. ఇప్పటికే చాలా వ్రాసేను.

ఎన్నటికీ నీ వాడనైన
విజయ్.
హైద్రాబాదు,
మే 30, 67."

"నా, మధురదేవతా!

నీ ఉత్తరం చూసి నవ్వుకున్నాను. నన్నెంతో ఆకాశాని కెత్తివేస్తూ వ్రాసిన నీ లేఖను చూస్తుంటే నువ్వెంత పిచ్చిదానివో నవిపిస్తుంది. దేహసౌందర్యానికి లొంగిపోక ఆత్మసౌందర్యం మాత్రమే ప్రేమించే పురుష కోటికి ఒక్కరుంటారని, ఉన్న ఆ బహు కొద్దిమందిలో నే నగ్రగణ్యుణ్ణనీ, నాలాటి ఉన్నతుడికి భార్య కాగలిగిన నీ వెంతో అదృష్టవంతురాలి నవి ఏమేమో వ్రాసేవు ఆవేశంగా.

కాని కమలా! అంత స్వార్థం కూడదు సుమా! నీ కంటె ఎక్కువగా నిన్ను చేపట్టిన అదృష్టవంతుడివి నేనుండగా ఈ ప్రపంచంలోకెల్లా నువ్వే అదృష్టవంతురాలి వంటావేం? ఇకనైనా నీ అభిప్రాయం మార్చుకోవోయ్ అల్లరిపిల్లా!

భానుని వద్దనటంలో నేనేం గొప్పవాడినని భావించటంలేదు. పైగా, ఈ విషయం నా స్వార్థపరత్వాన్నే నిరూపిస్తుంది. ఔను, కమలా! నాలో స్వార్థం ఎక్కువ. నాకు నచ్చిన స్త్రీని పెళ్లాడటం కోసం, కని పెంచిన తలిదండ్రులను, ఒక అమాయిక బాలికను కష్టపెట్టే నేను 'స్వార్థపరుడివికాక మరేమిటి? కాని నాలో ఈ స్వార్థమే లేకపోతే ఈ దేవి అనుగ్రహానికి పాత్రుడనయ్యేవాడినా?

నీ ప్రియతముడు,
విజయ్.
హైద్రాబాదు,
జులై 2, 67."

"డార్లింగ్! నా ప్రాణమా! నా దేవతా!

ఓహ్! ఎంత ఆనందంగా ఉంది నాకీ రోజు! నా కమలా! వచ్చేస్తున్నాను, ప్రియా, నీ దగ్గిరకు వచ్చేస్తున్నాను. మా అధికారి ఈ నెలలో మూడు రోజులు సెలవివ్వటానికి అంగీకరించేడు. నాలుగో రోజు ఆదివారంకూడా కలిసివచ్చేట్లు శనివారం సాయంత్రం జి. టి. ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వస్తున్నాను. ఆదివారంనాడు సూర్యోదయంతోపాటు వికసిత కమలంలాటి మా కమల వదనాన్ని చూడాలి. సరేనా?

ఈ రోజు బుధవారం. శనివారం ఇంకా మూడు రోజులుంది. కాని ఈ మధ్యకాలం అనంతంగా, అతి బరువుగా కనిపిస్తుంది. నా కలలు రూపుదాల్చే రోజు, నా కోరికలు ఫలించే దినం అన్నమాటుంటే కలిగే ఈ ఆనందంలో ఇంతకంటె ఏం వ్రాయగలను? మనం కలుసుకున్నప్పుడు మన పెళ్లివిషయాలుకూడా మాట్లాడుకుందాం.

అనుక్షణం నిన్నే కలవరిస్తూ, నీ నామధేయమే స్మరిస్తూ గడిపే నీ
విజయ్."

* * *

ఆదివారం ఉదయం. ఆరుగంటల వేళ.

అప్పుడే ఆగిన జి. టి. ఎక్స్‌ప్రెస్‌వైపు ఆత్రతగా చూస్తుంది మహారచయిత్రి కమలాదేవి. ఆ స్టేషనులో అరగంట ఆగుతుంది రైలు. అయిదు నిమిషాలైనా ఇంకా విజయ్ కనపడకపోవడంతో ఆదుర్దా పడుతూందామె. 'అత నెలా ఉండేదీ, ఏ దుస్తుల్లో వచ్చేదీ ముందుగా తెలియబరిచినా బాగుండేది.' అనుకుంటూ మరోసారి ఆవైపునుండి ఈవైపుకు దృష్టి సారించింది కమల. చివరికి గ్రే కలర్ సూటులో చిన్న సూటుకేసుతో నిలబడి తనలాగే ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్లున్న ఓ యువకునిమీద ఆమె చూపులు నిల్చాయి.

కొద్దిక్షణాలు అతనిని పరిశీలించి చివరికి ఆ నిరీక్షణా అదీ చూసి తప్పకుండా అతను "విజయ్" అయిఉంటాడని నిశ్చయించుకుని అతని దగ్గిరగా వెళ్లింది. కాసేపు అతనివంకే చూస్తూ నిలబడింది.

అతనోసారి ఆమెవంక పరీక్షగా చూసి తనకు కావలిసింది ఆమె కాదన్నట్లు ముఖంపెట్టి ఎటో చూడసాగేడు.

ఇక ఆలస్యంచెయ్యటం ఇష్టంలేక "క్షమించండి. మీ పేరు విజయ్ కదూ?" అని అడిగింది కమల.

"ఔను. కమలాదేవిగారి కోసం ఎదురుచూస్తున్నాను. ఆమె మిమ్మల్ని పంపిందా?" ఆత్రంగా అడిగేడు విజయ్.

కమల నవ్వింది. "ఔను. ఆమే నన్ను పంపింది. రండి, వెళదాం" అంటూ నడిచింది. అతనామె ననుసరించేడు.

టాక్సీ మాట్లాడుకున్నారు. దారిలో సంభాషణ జరగలేదు.

'కమల స్వయంగా తను రాకుండా ఎవరినో ఎందుకు పంపినట్లు? సర్దాగా తనని ఏడిపించటానికి అలా చేసిందా? ఏమో, ఈమె నడిగితే? ఏం బాగుంటుంది? అసలీమె ఎవరో! కమలకు సోదరో, బంధువో అయిఉండవచ్చు.

ఇంతకూ కమల స్టేషనుకు ఎందుకు రాలేదబ్బా! ఇంటినుండి స్టేషనుకు ఇంతదూరం ప్రయాణం చేసి అలిసిపోయిన తన ముఖాన్ని చూపటం ఇష్టంలేక ఇంటివద్దనే తనకు కొత్తగా కనపడాలనే ఉద్దేశ్యంతో రాలేదేమో! అసలే ఆడవాళ్లకు తమ 'ఎప్పియరెన్సు' మీద పట్టింపు జాస్తి. ఎంత రచయిత్రి అయినా కమలకూడా స్త్రీయేగా'. నవ్వుకున్నాడు విజయ్. కాని తన ఆలోచనల్లో తానుండి పక్కనే కూర్చున్న స్త్రీ ఆదేపనిగా తనలో తాను నవ్వుకోవటం గమనించనే లేదు విజయ్.

టాక్సీ ఇంటిముందు ఆగింది.

లోపలికి వెళ్లాక ముందుగదిలో అతన్ని కూర్చోపెట్టి అయిదునిమిషాల్లో తిరిగి వచ్చిందామె ఫలహారపు పళ్లేలతో, కాఫీకప్పులతో. కమలకోసం ఎంతో ఆత్రంగా చూస్తున్న విజయ్‌కు మళ్లీ ఆమెను చూడగానే కోపం వచ్చింది. అయినా దిగమింగుకుని "ఇంతకూ కమలాదేవిగారేరీ?" అని అడిగేడు.

ఆమె నవ్వింది. "నేనే, విజయ్, ఆ కమలాదేవిని" అంది చిలిపిగా.

మూర్ఛపోయినంత పనయింది తనికి. "నిజంగానా? ఇది నిజమేనా? ఏమిటి మీ రనేది?" అస్పష్టంగా గొణిగేడతను.

"నేను నీ కమలను, విజయ్!" అంది ప్రేమ ఉట్టిపడే కంఠంతో.

'అబద్ధం! అబద్ధం! ఈమె నా కమల కాదు. అంతా మోసం. ఇంతటి అందవికారి, ఒకసారి చూస్తేనే ఒళ్లు జలదరించే ఈ కురూపిస్త్రీ నా కమలంటే నేను నమ్మను. నమ్మను.' ఘోషిస్తుంది అతని హృదయం. కాని పైకిమాత్రం "నిజం చెబుతున్నారా మీరు? కమల ఎక్కడ? చెప్పండి" అని ఉద్రేకంగా అడిగేడు.

ఆమె ముఖం చిన్నబోయింది.

కాని వెంటనే నవ్వేస్తూ అతని దగ్గిరగా వచ్చి నిలబడింది. తన రెండుచేతులతోనూ అతని ముఖాన్ని పొదివి పట్టుకుని మధురంగా పలికింది కమల. "ఔను, విజయ్! నన్ను నమ్ము. నేనే నీ కమలను. మొదటిసారి నీ విమర్శన చదివినప్పుడు రచయిత్రిగా నీ మేధకు లొంగిపోయేను. ఆపైన నా ప్రేమనర్థిస్తూ నువ్వు వ్రాసిన లేఖను చూసి ఒక స్త్రీగా గర్వించేను. నిన్ను కళ్లారా చూడాలని, నీ కౌగిలిలో కరిగిపోవాలని కలలు కంటున్న కమలను నేనే, విజయ్! ఇంకా నమ్మకం లేదా? చూడు . . . ఇలా నా కళ్లలోకి చూడు. చంద్రుని చూసి పరవళ్లుతొక్కే సముద్రంలా నిన్ను చూసిన ప్రేమపారవశ్యంతో పొంగిపోతూన్న నా హృదయం కనిపించటంలేదూ ఈ రెండునేత్రాల్లో?"

భూమాత తన సహస్ర స్వరాలతో దైవాన్ని ప్రశంసిస్తూంటుంది.
—కోల్‌రిడ్జ్

హృదయంనంగతి ఏమోకాని నరకద్వారాలు కనపడుతున్నాయి అతనికి ఆమె కళ్లలో. ఎంతో మంది అందవిహీనలను చూసేడతను. కాని ఇంతటి కురూపిని, అందునా ఇంత భయంకరమైన కళ్లను ఎక్కడా చూడలేదు. అసలు ఏ మనిషి కళ్లలోనైనా, అందునా ఒక స్త్రీ నేత్రాలలో అంతటి అందవికారం ఉంటుందని అతనెన్నడూ ఊహించనుకూడా లేదు. ఆమె కళ్లు పెద్దవే. కాని ఆ కళ్లలో మెల్లలాటి ఓ చిత్రమైన అవకరం ఉంది. ఆ అవకరానికితోడు కళ్లు మరింత పెద్దవిగా ఉండటంవల్ల చూడగానే ఒక్కసారిగా ఉలికిపడతారెవరైనా! ఆమె ముక్కుతూ అతి సామాన్యం. మళ్లీ మూతి మరీ భయంకరంగా ఉంది. ముఖం అంచులను తాకుతుందా అన్నంత పెద్ద నోరు. ఆ నోరు తెరిస్తే అష్టవంకర్లతో పళ్లు.

ఈ అవలక్షణాలన్నీ చాలవన్నట్లు ఆమె నల్లగా,

లావుగా, పొట్టిగా ఉంది.

'ఒక స్త్రీ, అందునా వేలాది పాఠకులను అంతటి అందమైన భావాలతో ఉర్రూతలూగించే రచయిత్రి రూపం ఇంత వికారంగా ఉండటం సంభవమేనా?' అనుకుంటున్నాడు తమఇద్దరి మధ్యనున్న అనుబంధాన్ని కూడా మరిచిపోయి విజయ్.

అతనివద్దనుండి ఎలాటి సమాధానం రాకపోయేసరికి ఆమె అతని తలను పట్టుకున్న చేతులను వెనక్కి తీసేసుకుంది.

"ఏమిటి, విజయ్, నాతో మాట్లాడదలుచుకోలేదా ఏం?" అంది చిరుకోపంతో.

అప్పటికి తెప్పరిల్లేడు విజయ్. "సారీ, కమలా! ఇన్నాళ్లూ కలల్లోమాత్రమే చూసి ఇప్పుడు ప్రత్యక్షంగా నిన్ను చూస్తూంటే ఉద్వేగంతో మాటలే రావటం లేదు!" అన్నాడు. అలా అని తన మాటల్లోని కృత్రిమత్వానికి తనే సిగ్గుపడ్డాడు.

కమల మనసు తేలికయింది. "ముఖం అదీ కడుక్కున్నట్టున్నారు. ఇది తిని కాఫీ తాగండి. తరవాత అన్ని విషయాలు మాట్లాడుకుందాం" అన్నది.

ఆమె పెట్టినది తింటూంటే చేదుమాత్రలు మింగుతున్నట్టుగా ఉంది అతనికి. కాఫీ కషాయంలా తాగేసేడు.

తరవాత ఆ రోజల్లా ఎంతో ఉత్సాహంగా ఏదో ఒకటి మాట్లాడుతూనేఉంది కమల. ఆమె రచనల్లోలానే ఆమె మాటలు ఎంతో పొందికగా ఉన్నాయి. ఆమె చెప్పే విషయాలు ఎంతో ఉదాత్తంగా ఉన్నాయి. నిజంగా ఆమెతో మాట్లాడటమే ఒక 'విద్య!' ఎన్ని గంటలైనా ఆమె చెబుతూంటే అలా వినాలనిపిస్తూంది. కాని, భగవాన్! ఆ రూపం! చూడటానికే భయం వేస్తూంది!

అక్కడినుండి తక్షణమే పారిపోవాలనిపిస్తూంది అతనికి. అతని హృదయం వెయ్యి ముక్కలైంది. అతనికి దుఃఖం వస్తూంది. అతని మెదడులో తీవ్రమైన సంఘర్షణ జరుగుతూంది. 'భగవాన్! ఏమిటి నాకీ పరీక్ష! ఎందుకింత కఠినశిక్ష? రచయిత్రిగా ఆమె నారాధించేను; ప్రేమించేను. కాని ఆమెను భార్యగా స్వీకరించటానికి మనసొప్పదేం?

ఆమె హృదయం నవనీతం; ఆమె మేథస్సు మునిశితం. కాని ఆమె కిలాటి భయంకర రూపం ఎలా ప్రసాదించేవు, ప్రభూ!

సౌందర్యానికి నిర్వచనం లేకపోవచ్చు. కాని అందవిహీనతకుకూడా ఒక హద్దనేది ఉంది.

నా భార్య అపురూపసౌందర్యవతి అవాలని నేనెన్నడూ కోరుకోలే(దు). కాని ఇలాటి కురూపిని కలలోకూడా ఊహించలేను. ఆమె మహారచయిత్రే కావచ్చు. కాని ఇలాటి రూపంగల స్త్రీని నా భార్యంటూ నలుగురికీ ఎలా చూపగలను?' వికలమనస్కుడైన విజయ్ ఆమెలా నిర్మలంగా, ఆనందంగా ఉండలేకపోయేడు.

సంతోషోద్రేకాలతో తబ్బిబ్బవుతున్న కమల అతని వాడిన వదనాన్ని గమనించనేలేదు.

మరువాడు ఉదయం హఠాత్తుగా అతని నిరుత్సాహాన్ని కనిపెట్టింది కమల. ఆలోచిస్తే నిన్నటిమండీకూడా అతనెంతో ముభావంగా ఉన్నట్టు జ్ఞప్తికివచ్చింది.

ఏదో తెలియని భయం ఆవహించిం దామెను.

"అదేమిటి, విజయ్, అలా ఉన్నావేం?" అని అడిగింది ఆత్రంగా.

"ఏంలేదు, కమలా, మా అధికారి మూడురోజులు సెలవిస్తానని తీరా అడిగితే ఒక్కరోజే ఇచ్చేడు. ఈ రాత్రి ట్రెయినుకే వెళ్లిపోవాలి." తల వంచుకుని సమాధానమిచ్చేడు విజయ్. ఒక అమాయికురాలిని మోసం చేస్తున్నందుకు బాధతో, సిగ్గుతో చితికిపోయేడు విజయ్.

"పోనీలే, విజయ్. బాధపడకు. ఈ రోజన్నా హాయిగా గడుపుదాం" అంది కమల నిట్టూరుస్తూ.

ఆ తరవాత ఒక భయంకరమైన నిశ్శబ్దత ఆవరించింది ఇద్దరినీ. నిన్నటినుండి తన ఆనందోత్సాహాలలో అతని ముఖంలోని భావాలను ఏమాత్రం పరిశీలించని కమలకు క్రమంగా ఏదో దారుణమైన సత్యం గ్రహింపుకు వస్తున్నట్టుగా ఉంది.

'ఇద్దరం ఒకరి నొకరం ఎంతో అర్థంచేసుకున్నాం. ఒకరి నొకరు చూసుకోవాలని కలవరించిపోయేం. కాని, ఇదేమిటి? ఈ స్తబ్దత ఏమిటితనిలో? ఇరవై నాలుగు గంటలకు పైగా తను ప్రేమించిన స్త్రీ, తను వివాహమాడబోయే పడతి ఇంత దగ్గిరగా ఉన్నా ఇతనిలో ఏమీ చలనం లేదే? నన్ను స్పర్శించాలనీ, నన్ను తనలో ఐక్యంచేసుకోవాలనీ కోరటంలేదా అతను?' ఆలోచిస్తూంది రచయిత్రి కమల.

> చిత్రపటాలతో నిండిన గది—
> ఆలోచనలు వ్రేలాడే గది.
> —సర్ జోషువా రేనాల్డ్స్

ఎటూ తేల్చుకోలేక సంధిగ్ధతలో పడిన కమల ఇక ఆపుకోలేక అతని చేతులను తన చేతిలోకి తీసుకొని, "విజయ్! ఈ సాయంత్రమే మనం విడిపోతున్నామనుకుంటే నా కెంతో బాధగా ఉంది. మనం ఎన్ని కలలు కన్నాం? ఇలా దగ్గిరగా రావాలని ఎంతగా కలవరించేం!" అంటూ అతని హృదయం మీద వాలిపోయింది.

ఆమె స్పర్శతో అతని నరాలు బిగుసుకుపోయేయి. ఆమెను పొదివి పట్టుకోలేని వణుకుతున్న తన హస్తాలనెవైపు జాలిగా చూసుకున్నాడు విజయ్. ఏంచెయ్యాలో తోచక, "కమలా!" అనిమాత్రం అనగలిగేడు.

ప్రేమకాని, మోహంకాని, ఏ భావోద్రేకమూ లేని అతని కంఠస్వరం విని చటుక్కున అతనినుండి విడివడింది కమల. అతనివంక చూస్తూంటే సమస్తమూ అర్థమైపోయిం దామెకు.

'ఔను. తను భయపడినంతా జరిగింది. తన రచనలను ఎంతో గొప్పగా విమర్శించే ఈ మేథావి, తన హృదయసౌందర్యాన్ని ఆరాధించే ఈ సున్నిత మనస్కుడు విజయ్కూడా తన రూపాన్ని భరించలేకపోతున్నాడు. ఎంతైనా ఇతనుకూడా మగవాడే!' కఠోరంగా నవ్వుకుంది కమల.

ఆపైన ఏమీ మాట్లాడుకోకుండానే ఒకరి భావాలు ఒకరి కర్థమైపోయేయి. అలాటి పరిస్థితి వచ్చినందుకు ఇద్దరూ బాధపడ్డారు; సిగ్గుపడ్డారు.

సాయంత్రం ట్రెయినుకు వెళ్లిపోయేడు విజయ్. ఆ తరవాత అతనివద్దనుండి ఎలాటి ఉత్తరమూ లేదు కమలకు. ఆమె రావాలని ఆశించనుకూడా లేదు.

ఆరునెలలు గడిచినాయి.

అనంతమైన కాలంలో ఆరునెలలు ఎంతో కాకపోవచ్చు. కాని ఆ కొద్దికాలంలోనే విపరీతమైన మార్పులు వచ్చినాయి కమల జీవితంలో. ఆ మార్పులు జరిగేకనే విజయ్వద్దనుండి ఓ ఉత్తరం వచ్చిం దామెకు.

"కమలా!

ఇంతకాలం తరవాత వ్రాస్తున్నందుకు ఆశ్చర్యంగా ఉందా? ఈ ఆరునెలల్లోనూ జీవితం నాకో పెద్ద గుణపాఠం నేర్పింది. ఏ దేహసౌందర్యం లేదని నిన్నవమానించేనో, నీ హృదయాన్ని తూట్లుపరచానో ఆ సౌందర్యాన్ని గూర్చిన నా అభిప్రాయం మారింది. దానికి కారణం మా భానుమతే.

మా వివాహం నిశ్చయమైన తరవాతనే భాను మశూచికం పోసి చనిపోయింది. ఆ జబ్బు పదిరోజులు ఎంతో బాధపడి చివరకు సమస్త బాధలూ తీరే మరో లోకంలోకి వెళ్లిపోయింది, భాను. జబ్బులో ఉన్నప్పుడు వికృతంగా తయారైన భాను ముఖాన్ని, మరణానంతరంకాలి, నుసైపోయిన ఆమె దేహసౌందర్యాన్ని చూసేక నాలో కనువిప్పు కల్గింది. ఒకప్పుడు సత్యంగా భాసించిన సౌందర్యమే అనతికాలంలో ఆదృశ్యమైపోగలదనీ, చివరకు శరీరసౌందర్యానికి గమ్యం శ్మశానమేననీ గ్రహించగలిగేను.

కమలా! నా కిప్పుడనిపిస్తూంది. అసలు భగవంతుని సృష్టిలో అందహీనమైన వస్తువనేదే లేదనీ, ఒకవేళ మన కంటికి ఏ వస్తువైనా, ఏ వ్యక్తి అయినా వికారంగా కనిపిస్తే దానికి మన మనసులోని వికృతత్వమే కారణమనీ తోస్తూంది. చర్మచక్షువులకు గోచరించే రూపమే సౌందర్యానికి ఆలవాలంకాదు. కొందరికి మేథ అందంగా ఉంటుంది. మరికొందరికి హృదయం అందమైనది కావచ్చు. కాని వీటన్నిటికన్నా జాజ్వల్యమానంగా ప్రకాశించే ఆత్మసౌందర్యం గొప్పది. ఈ రకమైన సౌందర్యం అందరికీ ఉండదు. అందరికీ కనపడదుకూడా. భాను మరణం నాలోని అంతర్నేత్రాన్ని తెరవటంతో నీ ఆత్మసౌందర్యాన్ని సందర్శించ గల్గుతున్నాను.

ఇప్పటికైనా నన్ను క్షమించి స్వీకరిస్తావని ఆశిస్తూ

నీ

విజయ్."

ఆఉత్తరానికి ఆమె వెంటనే జవాబు వ్రాసింది.

"విజయ్!

నీలోని అంతర్నేత్రం తెరుచుకున్నందుకు చాలా సంతోషం. నా కీమధ్యనే వివాహమయింది. ఆయన అతి ప్రయాసతో నన్ను ప్రేమించటంలేదు. అప్రయత్నంగా, అనివార్యంగా, అతి సహజంగా లభిస్తూంది నా కాయన ప్రేమ.

ఆయనకు కావలసింది నా రచనల మాధుర్యము, నా ప్రేమమాత్రమే. కేవలం బాహ్యసౌందర్యాన్ని చూసి ఆనందించే స్థితికి అతీతంగా ఉన్నారాయన. ఎందుకో తెలుసా? ఆయన పుట్టుగుడ్డి.

ఇక ఉంటాను.

—కమల." ★